క్లుప్తంగా

చెంచుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయంలో జరిగింది. నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లోని వివిధ గిరిజన గూడేల్లో నివశిస్తున్న చెంచులు తమ సమస్యలను ప్రాజెక్ట్ అధికారి వెంకటశివ ప్రసాద్‌కు వినతి పత్రాల ద్వారా విన్నవించారు. బోర్లు, రక్షిత తాగునీరు, ఉద్యోగ, ఉపాధి కల్పనతో పాటు అటవీ భూహక్కు చట్టం కింద పట్టాలు ఇవ్వాలని గిరిజనులు కోరారు.

మల్లన్నకు నృత్యార్చన



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై నందికొట్కూరుకు చెందిన సిద్దేంద్ర నర్తన కూచిపూడి అకాడమీ వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో మహాగణపతిం, మూషికవాహన, శ్రీశైల వాసా, అయిగిరినందిని, నమో నమో నటరాజ, శివ తాండవం, శంభో శివ శంభో తదితర గీతాలకు అర్చన, రామతులసి, శశికమల, వెంకటపూజిత తదితరులు నృత్యం చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

నందికొట్కూరు: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని నారాయణ కళాజాత బృందం సభ్యుడు నరసింహులు తెలిపారు. సోమవారం పట్టణంలో వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెచ్‌ఐవీ నివారించేందుకు చికిత్స కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



చిన్న కోనేరులో భక్తుల స్నానాలు

మహానంది: క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవారికి అష్టవిధ మహామంగళ హారతులు నిర్వహించారు.

ఉపాధి కూలీ మృతి



శివన్న(ఫైల్)

కొత్తపల్లి: ఉపాధి పనులకు వెళ్లిన కూలీ అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని ఎర్రమఠం గ్రామానికి చెందిన నల్లవలి గొల్ల శివన్న(63) ఉదయం గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లాడు. పని చేస్తూ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తోటి కూలీలు వెంటనే ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రా నికి తరలించారు. అక్కడి నుంచి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు.. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో కర్నూలుకు తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయమై ఏపీఓ విమలమ్మను వివరణ కోరగా ఉపాధి కూలీ మరణించిన మాట వాస్తవమేనని తెలిపారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి వర్తించే వాటిని అందించేందుకు కృషి చేస్తామన్నారు.

నిత్యం అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: మండల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దార్ ఉమారాణి సోమవారం తెలిపారు. రానున్న 21, 22వ తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ సూచనల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకూడదన్నారు. మట్టి మిద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారు, శిథిలావస్థకు వచ్చిన నిర్మాణాల్లో ఉన్న వారు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలన్నారు. వర్షాల కారణంగా ఏమైనా ప్రమాదాలు సంభవించినా, సహాయ, సూచనలు, అవసరమైనా కంట్రోల్ రూమ్ 9573511094, 9000879001, 8187889196 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వేలంలో భారీగా తగ్గిన ఆదాయం

- మాన్యం భూముల కౌలుకు ఆసక్తి చూపని రైతులు
- వ్యవసాయంలో తీవ్ర నష్టాలు రావడమే కారణం



దేవస్థానం భూములకు వేలం పాట నిర్వహిస్తున్న ఈఓ వెంకటరమణ

పాములపాడు: మండల కేంద్రంలో దేవస్థాన భూములకు సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలో ఆదాయం భారీగా తగ్గింది. ఏప్రిల్ నెలలో వేలం పాటలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధం చేయగా ఒక్క రైతు కూడా రాలేదు. దీంతో వాయిదా వేసిన విషయం విధితమే. ప్రస్తుతం మలి విడత నిర్వహించగా కేవలం 10 మంది రైతులు మాత్రమే వేలం పాటలో పాల్గొనేందుకు రూ.1000 డిపాజిట్ చేసి పేర్లు నమోదు చేయించుకున్నారు.

రూ.4.11లక్షలు తగ్గిన ఆదాయం:
గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.4.11లక్షల ఆదాయం తగ్గింది. గ్రామంలో చెన్నకేశ ఆంజనేయ స్వామి దేవస్థానానికి 31.09 ఎకరాలకు గత ఏడాది రూ.1,42,000 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కేవలం రూ.84వేలకు మాత్రమే రైతులు దక్కించుకున్నారు. చౌడేశ్వరీదేవి దేవస్థానం భూములు 19.08 ఎకరాలకు గత ఏడాది రూ.3,00,000 ఆదాయం రాగా ఈ ఏడాది కేవలం రూ.1,12,000 మాత్రమే ఆదాయం వచ్చింది. నాగలింగేశ్వరా స్వామి దేవస్థానం భూమి 12.97 ఎకరాలకు గతేడాది రూ.2,45,000లకు గాను ఈ ఏడాది కేవలం రూ.80,000 మాత్రమే కౌలుకు దక్కించుకున్నారు. అంటే గత ఏడాది రూ.6,87,000లకు రైతులు వేలం పాటలో కౌలుకు భూములు దక్కించుకోగా ఈ దఫా కేవలం రూ.2,76,000 మాత్రమే చెల్లించి భూములను దక్కించుకున్నారు.

రైతుల నుంచి స్పందన కరువు
గతంలో పంట దిగుబడులు ఆశాజనకంగా రావడం, ధాన్యానికి గిట్టుబాటు ధర ఉండడంతో కౌలుకు తీసుకునేందుకు రైతుల మధ్య తీవ్ర పోటీ నెలకొనేది. ఇప్పుడు సీన్ పూర్తిగా రివర్స్ అయ్యింది. అప్పట్లో దేవస్థానం భూములను అధిక మొత్తంలో చెల్లించి కౌలుకు దక్కించుకున్న రైతులు తీవ్ర నష్టాలను చవి చూశారు. పంటల సాగుకు చేసిన పెట్టుబడులు కాదు కదా కనీసం కౌలుకు చెల్లించిన సొమ్ము కూడా రైతులకు రాలేదు. పంట దిగుబడులు తగ్గడం, గిట్టుబాటు ధరలేకపోవడం అన్నదాతలను తీవ్రంగా కుంగ దీసింది. దీంతో గతంలో వేలం పాటలకు భూములు దక్కించుకున్న రైతులు ఒక్కరు కూడా వేలం పాటలో భూములు కౌలుకు దక్కించుకునేందుకు ముందుకు రాలేదు. అధికారులు చేసేదేమిలేక రైతులు వేలంలో పాడిన పాటలకే భూములను అప్పగించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి వెంకటరమణ, పర్యవేక్షకుడు బాలుడు, సిబ్బంది నారాయణ, ధర్మకర్త వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మల్లన్నకు శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ



వెండి రథాన్ని లాగుతున్న అర్చకులు,అధికారులు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చారణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు చేపట్టారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై అధిష్టింపజేసి ఆలయ ప్రదక్షిణ చేయించారు.

22న హనుమాన్ జయంతి వేడుకలు



బ్యానర్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలో ఈనెల 22వ తేదీ హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 22న ఉదయం ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం హనుమాన్ శోభా యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో లోకేశ్వరరెడ్డి, పాలరాముడు, అర్చకులు జితేంద్ర, జనార్దన్‌రెడ్డి, బాబురెడ్డి, దివాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: ఈ నెల 22వ తేదీ హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్య నిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని రామాలయం ఆవరణలో బ్యానర్‌ను ఆవిష్కరించారు. గురువారం సాయంత్రం 4 గంటలకు రామాలయం నుంచి హనుమాన్ శోభయాత్ర ఉంటుందన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశుడు



మహానందిలో పల్లకీసేవ జరుగుతున్న దృశ్యం

మహానంది: శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి పల్లకీలో ఆశీనులు గావించారు. పల్లకీ సేవకు ముందు గోమాతలను అలంకరించి ముందు నడిపించారు. శాస్త్రోక్త పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీని ఊరేగించారు.

ఆత్మకూరులో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రజా సంఘాల నాయకులు

ఆత్మకూరు: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా యుద్ధంలో పాలు పంచుకున్న త్రివిధ దళాలకు కృతజ్ఞతాభినందనలతో సోమవారం పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. నంద్యాల టర్నింగ్ నుంచి గౌడ్ సెంటర్ వరకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. జాతీయ జెండాలు చేతపట్టి వేలాదిగా ర్యాలీలో పాల్గొన్నారు. మాజీ సైనికులు, అధికారులు, రైతులు, యువజనులు, కర్షక కార్మిక వర్గాలు, మహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు నివాళులర్పించి, భారత సైనికుల ధైర్యసాహసాలను కొనియాడారు. తహసీల్దార్ రత్నరాధిక, కమిషనర్ రమేష్‌బాబు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశాలలో మందుల కొరత



మాట్లాడుతున్న వైద్యాధికారిణి సావిత్రి

పాములపాడు: స్థానిక ఆయుర్వేద వైద్యశాలలో మందుల కొరత నెలకొందని వైద్యాధికారిణి సావిత్రి అన్నారు. సోమవారం స్థానిక ఆయుర్వేద వైద్యశాలలో ఆమె మాట్లాడారు. ఏటా ఏప్రిల్ నెలలో మందులు సరఫరా అయ్యేవన్నారు. ఈ ఏడాది ఇంత వరకు మందులు సరఫరా కాలేదన్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కీళ్ల సమస్యలు, గ్యాస్ ట్రబుల్ తదితర వ్యాధులకు సరిపడా మందులు అందుబాటులో లేవని చెప్పారు. ప్రభుత్వం నుంచి సరఫరా కావాల్సి ఉందని తెలిపారు. మందులు అందుబాటులో లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో రోగులకు ప్రైవేటు దుకాణాలకు మందులు రాయాల్సి వస్తోందని పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేస్తున్న ఎస్‌ఐ

జూపాడుబంగ్లా: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని జూపాడుబంగ్లా ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని మండ్లెం గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని అనుమానితులు, రౌడీషీటర్లు, నేరచరిత్ర ఉన్న వారి ఇళ్లల్లో సోదాలు చేశారు. వెంకటేశ్వర్లు ఇంట్లో 30 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, అల్లర్లు, గొడవలు, నేరాలను నియంత్రించడానికి పోలీసులు ఉన్నారనే భరోసా ప్రజలకు కలిగించడానికే గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇకపై ప్రతి గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తామన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పాములపాడు: భారీ ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సుభద్రమ్మ, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు వెళ్లరాదని అన్నారు. మట్టి మిద్దెలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉన్న వారు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తెలిపారు. వర్షాల కారణంగా ఏవైనా ప్రమాదాలు సంభవించినా, సహాయ సూచనలు అవసరమైనా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం 9959863029, 998535011, 7799293550 సంప్రదించాలని వివరించారు.

భూములు మళ్లీ సర్వే చేయించాలని వినతి

పాములపాడు: రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో భూములు మళ్లీ సర్వే చేయించాలని మండలంలోని బానుముక్కల, వాడాల గ్రామాలకు చెందిన రైతులు తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రాలు అందజేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆరుగురు రైతులు ఒకే సమస్యపై విన్నవించుకున్నారు. రీసర్వే చేసిన పొలాల్లో విస్తీర్ణంలో తేడాలున్నాయని, మళ్లీ సర్వే చేసి సరి చేయాలని కోరారు.

ఉమామహేశ్వరుడికి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం స్వామివారికి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఉమామహేశ్వరునికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం



పగిద్యాలలో నివాళులర్పిస్తున్న దృశ్యం



నందికొట్కూరులో సీపీఎం నాయకుల నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పగిద్యాల: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పోరాట స్ఫూర్తి, త్యాగం అందరికీ ఆదర్శనీయమని సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ అన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలను కొనియాడారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని సమస్యలపై ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. సీపీఎం నాయకులు ఈశ్వరమ్మ, త్యాగరాజు, మద్దమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సేవలు మరవలేనివి
నందికొట్కూరు: పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరవలేనివని సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శ జీవితం గడిపారని కొనియాడారు. దేశంలో బలమైన వామపక్ష శక్తిగా ఎదిగారని గుర్తు చేశారు. పిల్లలు పుడితే స్వార్థం పెరుగుతుందని కనకుండా పేదల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహానుభావుడన్నారు. గోపాలకృష్ణ, కర్ణ, ఉస్మాన్, బాషా, షాజిదాబి, నాగన్న, పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి
కొత్తపల్లి: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, దాసు, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకుడు శేఖర్ అన్నారు. మండలంలోని సింగరాజుపల్లిలో పుచ్చలపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు.

పుచ్చలపల్లి ఆశయాలను సాధిద్దాం
ఆత్మకూరు: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను సాధించేందుకు కృషి చేద్దామని వక్తలు పిలుపునిచ్చారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, ఆదర్శ ప్రజాప్రతినిధిగా నిలిచిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఏసురత్నం, నరసింహ నాయక్, పట్టణ కార్యదర్శి రణధీర్, సీనియర్ నాయకులు ఎం.రజాక్ పేర్కొన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ధనుంజయ మీటింగ్ హాల్‌లో లో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.సురేంద్ర, వీరన్న, నాగేశ్వరరావు, మహ్మద్, మౌలాలి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నమారెన్న, నాగవెంకటేష్, దర్శనం నాగరాజు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అప్పగింత



గొలుసును అప్పగిస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య


మహానంది: మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు పోగొట్టుకున్న బంగారు గొలుసును అప్పగించిన సంఘటన సోమవారం మహానందిలో చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా వంగలపల్లె గ్రామానికి చెందిన వెంకటరెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చారు. ఆయన బయటి కోనేరులో స్నానం చేస్తుండగా తులం బరువున్న బంగారు గొలుసును పోగొట్టుకున్నాడు. దీంతో భక్తుడు హోంగార్డు నాయక్ దృష్టికి తీసుకెళ్లగా టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య గిరిజన యువకుల చేత వెతికించి దొరికిన గొలుసును అప్పగించారు.

పీజీఆర్‌ఎస్‌కు 10 వినతులు

కొత్తపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)కు 10 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. 8 మంది రైతులు భూముల సర్వే కోసం, ఇద్దరు భూముల సమస్యల పరిష్కారం కోసం వినతులు అందజేశారని చెప్పారు.

జోరు వాన

మహానంది: ఆలయ పరిసరాలతో పాటు గ్రామాల్లో సోమవారం జోరు వాన కురిసింది. పంట పొలాల్లో పసుపు, మొక్కజొన్న, పొగాకు దిగుబడులను ఆరబెట్టుకున్న రైతులు కాపాడుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. మొన్నటి వరకు ఎండిపోయి కళావిహీనంగా కనిపిస్తున్న నల్లమల అడవి ఇటీవల కురుస్తున్న వర్షాలతో పచ్చదనం పులుముకుంది.దీంతో మహానంది ఆలయ పరిసరాలు మహానందంగా కనిపిస్తున్నాయి.



వర్షాలకు చిరుగు తొడిగి పచ్చదనం పులుముకున్న నల్లమల



వర్షంలోనూ ఉపాధి పనులకు వెళ్లి వస్తున్న మహిళలు

గిరిజనులకు అన్ని వసతులు కల్పిస్తాం



గిరిజనుల వివరాలను సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు

కొత్తపల్లి: ఈనెల 18వ తేదీ సాక్షి దినపత్రికలో ‘గూడేల గోడు పట్టదా’ అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందనగా తహసీల్దార్ ఉమారాణి సోమవారం విలేజ్ రెవెన్యూ అధికారులైన వేణుగోపాల్, రామసుబ్బయ్యలను గిరిజన నివాసాలను సందర్శించాలని ఆదేశించారు. వారు అక్కడికి వెళ్లి గిరిజనుల పూర్తి వివరాలను సేకరించారు. ఎవరెవరికి ఆధార్ కార్డులు ఉన్నాయి, ఎవరికి లేవు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. నూతన రేషన్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. వీరికి గూడెంలోనే ఇంటి స్థలం, ఇల్లు ఏర్పాటు చేసే విధంగా సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని చెప్పారు.

విత్తన దుకాణాలను తనిఖీ చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నందికొట్కూరు: విత్తన దుకాణాలను రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి నాసిరకం విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకుడు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, పత్తి, వరి, మిరప తదితర పంటలు రైతన్నలు సాగు చేస్తారన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన విత్తనాలు గోదాముల్లో, సీడ్స్ దుకాణాల్లో ఆయా కంపెనీల సీడ్స్ దిగుమతి చేసుకుంటున్నారని తెలిపారు. వ్యవసాయ అధికారులు నమూనాలు సేకరించి పరీక్షించిన తర్వాతే రైతులకు విక్రయించేలా చూడాలని కోరారు.

డీఈఓ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

ఆత్మకూరు: విద్యాశాఖ అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 21వ తేదీన ఉమ్మడి జిల్లా డీఈఓ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు హనుమంతు, ప్రదీప్‌కుమార్, శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ముక్త కంఠంతో ఖండించాలన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందన్నారు. ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇస్కాల గ్రామంలో కార్డన్ సెర్చ్

- 8 బైక్‌లు, 14 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ, పోలీసులు

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ సురేష్‌బాబు ఆధర్యంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి గ్రామంలోని రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేశారు. 14 మద్యం సీసాలు, ధ్రువపత్రాలు లేని 8 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నేరాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కార్డన్‌సెర్చ్ నిర్వహించామని సీఐ తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.